నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, ఆదివారం 29 డిసెంబర్ 2024 | NIZAMABAD


# లిఫ్ట్ ప్రారంభించి చెరువులు నింపండి

**మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**



విద్యార్థికి ప్రభుత్వమే చికిత్స అందించాలని కలెక్టర్‌కు ఫోన్‌లో సూచిస్తున్న ఎమ్మెల్యే వేముల

మోర్తాడ్, డిసెంబర్ 28: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నందున చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల ద్వారా మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లోని చెరువులు నింపాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నీటిపారుదలశాఖ అధికారులకు సూచించారు. కమ్మర్‌పల్లి మండలంలో శనివారం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేను కలిసిన బషీరాబాద్ రైతులు.. ఎత్తిపోతల పథకం ద్వారా కాడి చెరువును నింపాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన వేముల.. అక్కడి నుంచే నీటి పారుదల శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతలను వెంటనే ప్రారంభించి మోర్తాడ్ ముసలమ్మ చెరువులోకి నీళ్లు నింపుతూ, సమాంతరంగా అక్కడి నుంచి బషీరాబాద్ కాడి చెరువులోకి నీళ్లు తరలించాలని సూచించారు. ముసలమ్మ చెరువు పంపుహౌస్ మోటర్లు స్టార్టు చేసి కాడి చెరువు నింపాలన్నారు.

**విద్యార్థికి ప్రభుత్వమే చికిత్స అందించాలి..**

భిక్కనూర్ గురుకుల కళాశాలలో చదువుతూ ప్రమాదవశాత్తు కాలేజీ బిల్డింగ్ పైనుంచి పడి రెండు కాళ్లు విరిగిపోయిన విద్యార్థి రిశ్వీత్‌కు ప్రభుత్వమే పూర్తిస్థాయి చికిత్స అందించాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మోర్తాడ్‌కు చెందిన విద్యార్థిని ఆయన నివాసంలో శనివారం వేముల పరామర్శించారు. సొంత డబ్బులు పెట్టి చికిత్స తీసుకున్నామని బాధిత కుటుంబ సభ్యులు చెప్పడంతో ప్రశాంత్‌రెడ్డి కలెక్టర్, డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి రిశ్వీత్‌కు ప్రభుత్వమే చికిత్స అందేలా దగ్గరుండి చూసుకోవాలని కోరారు. విద్యార్థికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా, సొసైటీ చైర్మన్ కల్లెం అశోక్, పర్స దేవన్న నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత నేడు (ఆదివారం) జిల్లాకు రానున్నారు. రాజకీయ కుట్రల్లో భాగంగా అక్రమ కేసులో జైలుకు వెళ్లి, విడుదలైన అనంతరం తొలిసారి ఇందూరుకు వస్తున్న ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు బీఆర్‌ఎస్ నేతలు, జాగృతి నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వస్తున్న కవితకు తొలుత డిచ్‌పల్లి వద్ద ఘనంగా స్వాగతం పలుకనున్నారు. బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో పాటు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. కవితకు స్వాగతం పలుకుతూ ఇప్పటికే నగరంలోని ప్రధాన కూడళ్లలో పెద్దపెద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు.

–నిజామాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన హోర్డింగ్

# నేడు ఇందూరుకు కవిత

## ఎమ్మెల్సీ రాక నేపథ్యంలో భారీ ఏర్పాట్లు

- డిచ్‌పల్లిలో స్వాగతం పలుకనున్న బీఆర్‌ఎస్ శ్రేణులు
- పెద్ద సంఖ్యలో తరలిరానున్న కార్యకర్తలు



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దుర్మార్గపు ఎత్తుగడలకు పాల్పడి కవితను అక్రమంగా కేసుల్లో ఇరికించింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ఆమెను తప్పుడు కేసులో జైలుకు పంపింది. నెలల పాటు అక్రమ నిర్బంధాలకు గురి చేసినప్పటికీ మొక్కవోని ధైర్యంతో న్యాయ పోరాటం చేసిన కవిత.. జైలు నుంచి విడుదలయ్యారు. కక్షసాధింపు రాజకీయాలను దాటుకుని, ఢిల్లీ నిర్బంధాలను బద్దలు కొట్టిన ఆమె.. తొలిసారిగా నిజామాబాద్ పర్యటనకు వస్తుండడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు, జాగృతి నేతలు డిచ్‌పల్లిలో ఘనంగా స్వాగతం పలుకనున్నారు. అక్కడి నుంచి కవిత నేరుగా నిజామాబాద్‌లోని సుభాష్‌నగర్ తెలంగాణ తల్లి విగ్రహం వరకు చేరుకుంటారు. అక్కడ నివాళులు అర్పించిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు.

**కుట్రలు బహిర్గతం..**

ఢిల్లీలో వెలుగు చూసిన ఓ కేసు విషయంలో కవితను బాధ్యురాలిని చేస్తూ రెండేండ్లుగా నడిపించిన టీవీ సీరియల్ లాంటి దర్యాప్తులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు ఈడీ తిలోదకాలిచ్చింది. మహిళలను విచారణ పేరిట కార్యాలయాలకు పిలవడం రాజ్యాంగ విరుద్ధమంటూ ఈడీపై సుప్రీంకోర్టులో కవిత వేసిన కేసు విచారణ నడుస్తుండగానే, నిర్బంధంలోకి తీసుకుని ప్రజాస్వామ్య విలువలను కేంద్రం మంటగలిపింది. ఈడీ చర్యలపై న్యాయస్థానాల్లో పోరాటం చేసిన కవితకు ఉపశమనం దక్కడంతో ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తనదైన శైలిలో వాగ్బాణాలు ఎక్కుపెట్టి ప్రజల కోసం పోరాడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల అంశాన్ని లేవనెత్తి ఆయా సంఘాలతో వరుసగా భేటీలు నిర్వహిస్తున్నారు. బడుగు, బలహీన వర్గాలకు గొంతుకై ప్రభుత్వాన్ని నిలదీస్తూ నాటి ఉద్యమ కాలం నాటి పోరాట స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు.

**తెలంగాణ తల్లికి వందనం..**

ప్రజల ఆలోచనలకు వ్యతిరేకంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సంప్రదాయంగా కొనసాగించాల్సిన ఆనవాళ్లను మారుస్తూ నియంతృత్వ ధోరణిలో ముందుకెళ్తున్నది. ఇందులో భాగంగానే తెలంగాణ లోగోను మార్చేందుకు తొలి నాళ్లలోనే ప్రయత్నించి విఫలమైంది. ఆ తర్వాత ఏకంగా తెలంగాణ తల్లి రూపాన్నే మార్చేసే సాహసానికి ఒడిగట్టింది. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయదలిచిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని స్థాపించారు. కోట్లాది మంది ప్రజలు ఆరాధించిన విగ్రహాన్ని కాదని, మరో విగ్రహాన్ని ఎంపిక చేసి ఆవిష్కరించారు. ఉద్యమ కాలంలో భావోద్వేగ కేంద్రంగా మారిన నాటి తెలంగాణ తల్లి విగ్రహాన్నే ప్రజలు ఇప్పటికీ కొలుస్తున్నారు. ఆదివారం నిజామాబాద్ పర్యటనకు రానున్న కవిత.. ఉద్యమ కాలంలో సుభాష్‌నగర్‌లో స్థాపించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సందర్శించి, నివాళులు అర్పించనున్నారు.

- ఎంత శ్రమించినా వీడని చిక్కుముడులు
- పెద్ద చెరువు కట్టపై సీన్ రీ కన్‌స్ట్రక్షన్!
- చెరువు నీటి శాంపిల్స్ సేకరణ
- విచారణ తీరుపై ఎస్పీ సింధూశర్మ ఆరా

# వీడని ఉత్కంఠ

**ముగ్గురి మృతి కేసులో కొలిక్కి రాని దర్యాప్తు**



అడ్లూర్‌ఎల్లారెడ్డి పెద్దచెరువు నుంచి నీటిని సేకరిస్తున్న పోలీసు సిబ్బంది

కామారెడ్డి, డిసెంబర్ 28: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ముగ్గురి మృతి ఉదంతం వెనుక ఉన్న మిస్టరీ వీడలేదు. మూడు చావులకు కారణాలేమిటో, ముగ్గురి మధ్య ఉన్న బంధమేమిటో బయటికి రావడం లేదు. దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు ఈ కేసును కొలిక్కి తెచ్చేందుకు యత్నిస్తున్నారు. భిక్కనూరు ఎస్సై సాయి కుమార్, బీబీపేట కానిస్టేబుల్ శ్రుతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ మృతి వెనుక గల వాస్తవాలను వెలికి తీసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నా చిక్కుముడులు మాత్రం వీడడం లేదు. ఆ ముగ్గురే బాధితులు, నిందితులు కావడం, ముగ్గురూ మృతి చెందడంతో పోలీసులు ఈ కేసును ఛేదించడానికి తలలు పట్టుకుంటున్నారు. సాంకేతిక ఆధారాలతో ముందుకెళ్తున్నా ఎక్కడా స్పష్టత రావట్లేదు. పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ రిపోర్టు వస్తేనే క్లారిటీ వస్తుందని పోలీసులు చెబుతున్నారు.

**చెరువు కట్టపై ఆనవాళ్ల సేకరణ..**

దర్యాప్తులో భాగంగా శనివారం సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్దకు వెళ్లిన పోలీసులు.. ఘటనా స్థలంలో ఆనవాళ్లను పరిశీలించారు. చెరువు నీటి శాంపిళ్లను సేకరించారు. ముగ్గురు చెరువులోకి దూకారా? లేక ఎవరైనా తోసేశారా? అన్నది నిశితంగా గమనించారు. ఒక బృందం భిక్కనూరు పోలీసుస్టేషన్‌కు, మరో బృందం బీబీపేట్ ఠాణాకు వెళ్లి అదనపు వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. మరోవైపు, ఇంకో బృందం ఎస్సై సాయికుమార్ కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించినట్లు తెలిసింది. విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఏమాత్రం వివరాలు చెప్పడం లేదు. మృతుల్లో పోలీసుశాఖకు చెందిన వారు ఉండడంతో దర్యాప్తు వివరాలు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు.

**సాంకేతిక ఆధారాల సేకరణ..**

సాయికుమార్, శ్రుతి, నిఖిల్ మధ్య ఏం జరిగిందనేది తేల్చేందుకు పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. ఈ క్రమంలో కాల్ డాటా, వాట్సాప్ చాటింగ్‌లపై దృష్టి సారించారు. ముగ్గురికి సంబంధించి నాలుగు ఫోన్లను స్వాధీనం చేసుకున్నప్పటికీ, ఒక్క శ్రుతి ఫోన్ మాత్రమే లాక్ ఓపెన్ అయినట్లు తెలిసింది. మిగతా మూడు ఫోన్లను తెరిచేందుకు సాంకేతిక నిపుణులను రంగంలోకి దించినట్లు సమాచారం. ముగ్గురు వారం రోజులుగా గంటల కొద్దీ ఫోన్లు మాట్లాడినట్లు కాల్‌డాటా ఆధారంగా గుర్తించారు. వాట్సాప్ చాటింగ్ వివరాలు బయటికొస్తే మరింత సమాచారం దొరుకుతుందని భావిస్తున్నారు. చనిపోయే ముందు ముగ్గురు కలిసి ఒకే కారులో అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు దగ్గరకు వెళ్లినట్లు గుర్తించారు. ఆ తర్వాత ఏం జరిగిందనేది తేల్చడంపై దృష్టి పెట్టారు. హత్యా.. ఆత్మహత్యా అనే కోణంలో పరిశోధిస్తున్న పోలీసులు డీ కోడింగ్ పద్ధతిలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్నారు. కేసును త్వరగా తేల్చాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఎస్పీ సింధూశర్మ నేరుగా రంగంలోకి దిగారు. శనివారం సదాశివనగర్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఆమె.. ఇన్వెస్టిగేటింగ్ అధికారి సంతోష్‌కు పలు సూచనలు చేశారు.



# మా చదువులెట్లా?

**సమ్మెలో సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు**

- కేజీబీవీల్లో నిలిచిన పాఠాలు
- సమీపిస్తున్న వార్షిక పరీక్షలు
- ఇంకా పూర్తి కాని సిలబస్
- ఆందోళనలో టెన్త్, ఇంటర్ విద్యార్థులు
- సమస్యలు పరిష్కరించాలని గాంధారి, బిచ్కుందలో ధర్నా

గాంధారి/బిచ్కుంద, డిసెంబర్ 28: సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెతో విద్యాబోధన ముందుకు సాగక పోవడంతో విద్యార్థినులు శనివారం రోడ్డెక్కారు. మా చదవులు ఆగిపోయాయి.. మా ఉపాధ్యాయులు మాకు కావాలంటూ గాంధారి, బిచ్కుంద మండలాల్లోని కేజీబీవీ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. సబ్జెక్టు టీచర్లు, లెక్చరర్లు లేక, పాఠాలు చెప్పే తాత్కాలిక సిబ్బంది రాక నష్టపోతున్నామని పాఠశాలల ఎదుట బైఠాయించారు. గతేడాది వరకు సరిపడా టీచర్లు, సకల వసతులతో కళకళాడిన కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) ప్రస్తుతం సమస్యలతో సతమతమవుతున్నాయి. రెగ్యులర్ టీచర్లు, లెక్చరర్లు లేక సిలబస్ ముందుకు సాగడం లేదు. ఇన్నాళ్లు పాఠాలు చెప్పిన సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మెకు దిగడంతో పాఠాలు పూర్తిగా నిలిచి పోయాయి. నెల క్రితం గెస్టు టీచర్లు, లెక్చరర్లను నియమించినా కొందరు రావడం లేదు. గాంధారిలో ఆరుగురు మాత్రమే పాఠాలు చెబుతూ, పిల్లల బాగోగులను చూస్తున్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో సిలబస్ పూర్తి కాక, విద్యాబోధన సాగక విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు, నాసిరకం భోజనం తినలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వారు శనివారం ధర్నాకు దిగారు.

**సరిపడా టీచర్లు..** షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి.. కడుపు నిండా కమ్మని భోజనం.. ఇంట్లో ఉన్నట్లే సకల వసతులు.. ఇది గతేడాది వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనిపించిన పరిస్థితి. కానీ ఏడాదిలోనే ఎంతో మార్పు వచ్చింది. పాఠాలు చెప్పే వారు లేరు. ఉన్న వారు సమ్మెకు దిగారు. భోజనం, వసతులు అంతంతే అన్నట్లు మారాయి. దీంతో విద్యార్థులు రోడ్డెక్కుతున్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యాబోధన నిలిచిపోవడంపై ఆందోళనకు దిగుతున్నారు. తాజాగా శనివారం గాంధారి, బిచ్కుంద మండలాల్లో విద్యార్థులు ధర్నా నిర్వహించారు.



**బాటనీ లెచ్చరర్ లేరు..**

గాంధారి కేజీబీవీలో బైపీసీ సెకండియర్ చదువుతున్నా. ఇక్కడ ఇంటర్ ఫస్ట్ బ్యాచ్ మాదే. ఏడాది నుంచి బాటనీ లెక్చరర్ లేడు. పాఠాలు చెప్పే వారు లేకపోతే అవి మాకు ఎలా అర్థమవుతాయ్. ఎలా చదవాలో అర్థమైతలేదు. బాటనీ సబ్జెక్టును బోధించే వారు లేకపోవడంతో వచ్చే పరీక్షలో ఏం రాయాల్నో ఏమో?

**- నవ్యశ్రీ, సెకండియర్, కేజీబీవీ, గాంధారి**



**చదువులు సాగడం లేదు..**

నేను పదో తరగతి చదువుతున్నా. వార్షిక పరీక్షలకు సమయం ఎక్కువ లేదు. పాఠశాల ప్రారంభమై ఆర్నెళ్లు గడుస్తున్నా సిలబస్ ఇంకా పూర్తి కాలేదు. నెల రోజుల క్రితం టీచర్లను నియమించినా వారు కొన్ని రోజులు పాఠాలు చెప్పి వెళ్లి పోతున్నారు. మాకు బోధించే టీచర్లు సమ్మెలో ఉండడంతో చదువులు ముందుకు సాగడం లేదు. పరీక్షలు ఎలా రాయాలో అర్థమైతలేదు.

**- లత, 10వ తరగతి, కేజీబీవీ, గాంధారి**



**రివిజన్ చేసుకోమంటున్నారు..**

మా ఉపాధ్యాయులు 20రోజుల నుంచి ధర్నాకు వెళ్తున్నారు. అక్కడి నుంచి వచ్చాక క్లాసులు తీసుకుంటారని చూస్తున్నాం. కానీ వాళ్లు పాఠాలు చెప్పకుండా రివిజన్ చేసుకోవాలని చెబుతున్నారు. ఎన్నిసార్లు రివిజన్ చేసుకోవాలి. వేరే ఉపాధ్యాయులను పంపిస్తే వారు చెప్పే పాఠాలు మాకు అర్థం కావు. మా ఉపాధ్యాయులే మాకు కావాలి.

**- పద్మ, కేజీబీవీ, బిచ్కుంద**



**పాఠాలు ప్రారంభమే కాలేదు..**

గాంధారి కేజీబీవీలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నా. ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ బాటనీతో పాటు ఇతర సబ్జెక్టుల పాఠాలను ప్రారంభించనే లేదు. పాఠాలు చెప్పే వారు సమ్మె చేస్తున్నారు. రెండు నెలలు గడిస్తే వార్షిక పరీక్షలు వస్తాయి. సిలబస్ పూర్తి కాకుండా పరీక్షలు ఎట్లా రాయాలి? మమ్మల్ని పట్టించుకునే వారే లేరు.

**- అఖిల, ఫస్టియర్, కేజీబీవీ, గాంధారి**

**అగమ్యగోచరం..**

గాంధారిలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు 300 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఇక్కడ హిందీ, బాటనీ, మ్యాథ్స్ బోధించే శాశ్వత ఉపాధ్యాయులు, అధ్యాపకులు లేకపోవడంతో సిలబస్ ముందుకు సాగడం లేదు. గెస్ట్ లెక్చరర్లతో నెట్టుకొస్తున్నప్పటికీ వారు ఇలా వచ్చి అలా వెళ్తున్నారు. సిలబస్ పూర్తి కాకపోవడం, వార్షిక పరీక్షలు దగ్గరకొస్తుండడంతో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. పాఠాలు బోధించే వారు లేకపోతే పరీక్షల్లో ఏం రాయాలని ప్రశ్నిస్తున్నారు.

**డిమాండ్ల సాధన కోసం..**

వివిధ డిమాండ్ల సాధన కోసం కేజీబీవీల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు సమ్మెలో ఉన్నారు. ఛాయ్ తాగినంత సమయంలోనే సమస్యను పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించారు. పాఠాలు చెప్పే వారు రాకపోవడం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతో విద్యార్థినులు నష్టపోతున్నారు. మరోవైపు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో భోజనం నాసిరకంగా మారిందని వారు వాపోతున్నారు. తమకు భోజనం సరిగా పెట్టకపోయినా.. పాఠాలు చెప్పే వారు కావాలని కోరుతున్నారు. విద్యార్థినుల ఆందోళన విషయం తెలిసి అధికారులు అక్కడకికి చేరుకుని సముదాయించే ప్రయత్నం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

# జీపీ కార్మికుల ధర్నా

**కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను** నిలబెట్టుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లాలో గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది శనివారం ధర్నా నిర్వహించారు. బోధన్, డిచ్‌పల్లి, రుద్రూర్, కోటగిరి, ఎడపల్లి తదితర మండలాల ఎంపీడీవో కార్యాలయాల ఎదుట బైఠాయించారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఐదు నెలల నుంచి జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

– బోధన్ రూరల్, డిసెంబర్ 28



బోధన్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు




